క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్‌వలీ, ఎం.పద్మ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం



తెనాలిఅర్బన్: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని గాంధీ నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం 1925 డిసెంబర్ 6న భారత కమ్యూనిస్ట్ పార్టీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులు, మహిళలు, యువజన, విద్యార్థి, ఉద్యోగ, కళాకారుల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. వారి హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, చెరుకుమల్లి సింగారావు, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, పరుచూరి వెంకటేశ్వరరావు, సీతారామయ్య, జి.శివ, సీహెచ్ సాయి, శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ వాలీబాల్ జట్టు శిక్షణ



తెనాలిఅర్బన్: అంతర్ కళాశాలల పోటీలలో పాల్గొననున్న ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వాలీబాల్ జట్టు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ నెల 22 నుంచి తెనాలి జేఎంజే కళాశాలలో శిక్షణ ఇచ్చినట్లు పీడీ డాక్టర్ అరుణ సుజాత తెలిపారు. బుధవారం నుంచి జరగనున్న పోటీల్లో జట్టు పాల్గొనున్నట్లు చెప్పారు. జట్టు కోచ్‌గా రవీంద్ర, మేనేజర్‌గా తాను వ్యవహించనున్నట్లు తెలిపారు.

సాయి క్షేత్రంలో దత్త జయంతి

తెనాలిటౌన్: నంది వెలుగులోని శ్రీ సాయి క్షేత్రంలో మంగళవారం శ్రీ దత్త జయంతి నిర్వహించారు. షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. కాగడ హారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. సాయి క్షేత్రం వ్యవస్థాపక చైర్మన్ ఎంవీ హరిప్రసాదరావు, ఆలయ కార్యదర్శి శ్రీవల్లి, ఉపాధ్యక్షులు పార్వతి, ట్రస్టీలు శ్రీ సుకుమార్, ఆధ్యాత్మిక భాగవతారిణి శారదా చలపతి పాల్గొన్నారు.

రంగస్థల నటుడు సుబ్బారావుకు నివాళి



తెనాలిటౌన్: ప్రముఖ రంగస్థల నటుడు ఆరాధ్యుల వెంకట సుబ్బారావు వర్ధంతిని కళాకారులు మంగళవారం నిర్వహించారు. శివాజీ చౌక్ సెంటర్‌లో ఉన్న సుబ్బారావు విగ్రహానికి పలువురు కళాకారులు, ఆయన కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, కళాకారులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా దోహదం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం



షటిల్ ఆడి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



ఐతా నగర్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక



చంద్రబాబునాయుడు కాలనీలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు



కొల్లిపరలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మావతి

తెనాలిఅర్బన్: మట్టిలోని మాణిక్యాలు ఎందరో ఉంటారని, అవకాశం రాక కొందరు, సరైన వేదిక దొరకక మరికొందరూ క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని.. అలాంటి వారిని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. చెంచుపేటలోని ఏఎస్ఎం ఇండోర్ స్టేడియంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కొద్దిసేపు షటిల్ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 9,968 మంది క్రీడల్లో పాల్గొనేందుకు రిజిష్టర్ చేయించుకున్నారని చెప్పారు. ఇప్పటికే క్రీడకారులకు కిట్లను కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం.జశ్వంతరావు క్రీడలను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా బెలూన్‌లను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, కౌన్సిలర్లు మట్లపూడి సంధ్యారాణి, గోగిరెడ్డి మానసరెడ్డి, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, మేనేజర్ అప్పలరాజు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

\+ ఐతా నగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హై స్కూల్‌లో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్రీడా పోటీలను ప్రారంభించారు. షటిల్ ఆడి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గెద్దేటి ఝాన్సీవాణి, మట్లపూడి సంధ్యరాణి, స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, కమిషనర్ జశ్వంతరావు, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఏసీపీ సుధాకర్ పాల్గొన్నారు.

\+ చంద్రబాబునాయుడు కాలనీలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లు అందజేశారు. నాయకులు పెదలంక వెంకటేశ్వర్లు, సీమోను పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

కొల్లిపర: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను ప్రారంభించారు. కొల్లిపరలో ఎంపీపీ పద్మావతి క్రీడా పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. తమ క్రీడా ప్రతిభను చాటేందుకు ఇదో మంచి వేదిక అని చెప్పారు. ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, ఎంఈఓలు సాల్మన్‌ఖాన్, ఝాన్సీలత, పరిపాలనాధికారి ఏవో చంద్రమోహన్, భీమవరపు మధుసూధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచర్లపాలెం గ్రామంలో..

తెనాలిటౌన్: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను కంచర్లపాలెం గ్రామం పాఠశాలలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కోపల్లె మణిమ్మ, ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి, కోపల్లె సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కొలకలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు నాగదేవిక, చెక్కా సీతమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరపనని కల్పన, జెడ్పీ స్కూల్ కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దిలీప్, సూపర్‌వైజర్ జయశ్రీ పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ బేగమ్, పీఈటీలు వినయకుమార్, అంబేడ్కర్, సుబ్బారావులు పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి

ఎమ్మెల్యే శివకుమార్



రామలింగేశ్వర పేటలోని రంగా విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: వంగవీటి మోహన రంగా ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా వర్ధంతిని నందుల పేటలో వద్ద మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా పాటుపడ్డారని కొనియాడారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలపడంతో పాటు పేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తోట రఘురామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కఠారి హరీష్, తాడిబోయిన రమేష్, పోతిరెడ్డి హేమలత, పోతిరెడ్డి నాగరాజు, పోతిరెడ్డి రవీంద్రనాథ్, విష్ణుశెట్టి మాధవరావు, కన్నెగంటి గోపయ్య, నీలి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

\- 11వ వార్డులోని మూడు బొమ్మల సెంటర్ వద్ద రంగా వర్ధంతిని వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి ఎమ్మెల్యే శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతవరపుల శర్మ, బుచ్చు రంగారావు, పెయింటర్ శ్రీను, కందుకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

\+ 15వ వార్డు రామలింగేశ్వరపేట డిపో రోడ్డులో వంగవీటి మోహన రంగా వర్ధంతిని కాపు సంఘ నాయకులు, యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు సంఘ నాయకునిగా, శాసన సభ్యునిగా రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, నాయకులు మేడేపల్లి ప్రభాకర్, నాగిశెట్టి సాంబయ్య, తోట నాగరాజు, రావూరి కృష్ణ, శ్రీను, శివకృష్ణ, వెంకట్రావు, సుబ్రమణ్యం, చందు తదితరులు పాల్గొన్నారు.

\+ రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో వీఎం రంగా వర్ధంతిని మూడు బొమ్మల సెంటర్‌లో నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, దారా రామకృష్ణ, బండారు రవికాంత్, తన్నీరు శివశంకర్, బెల్లపు యశ్వంత్ పాల్గొన్నారు.

\- వల్లెం మురళి ఆధ్వర్యంలో నందులపేటలోని వీఎం రంగా విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తోటకూర వెంకటరమణరావు, గ్యాలం వేణు, శిల్పుల శ్రీను, హరి, చెన్నయ్య, హరికృష్ణ, కాలేషా, సుధాకర్, దాది సూర్య, శివమణి తదితరులు పాల్గొన్నారు.

\+ వీఎం రంగా వర్ధంతిని నందులపేటలో నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను కొనియాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.



నందులపేటలో నివాళులర్పిస్తున్న రమణరావు, వేణు

కఠెవరంలో మోహన రంగాకు నివాళి

తెనాలిటౌన్: కఠెవరం గ్రామంలో వంగవీటి మోహన రంగా వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. రంగా విగ్రహానికి జనసేన, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, తోట పానకాలరావు, మంచాల సురేష్, పుట్టా రవి పాల్గొన్నారు.

గ్రామీణులకు టెలీ వైద్యం గొప్ప ముందడుగు

'ధర్మ' ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆరోగ్య సమాజం ఆశయంగా శారద సర్వీస్ సొసైటీ గ్రామీణులకు టెలీ వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావటం గొప్ప ముందడుగుగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పెదరావూరులో ఉచిత టెలీ వైద్య సేవలకు ఏర్పాటు చేసిన ధర్మ ప్రాజెక్టు కేంద్రాన్ని ఎమ్మెల్యే శివకుమార్ మంగళవారం ప్రారంభించారు. సభకు డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్న భావనతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని భర్తీచేసి, ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చిందన్నారు. ఫలితంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం లభిస్తోందని వివరించారు. శారద సర్వీస్ సొసైటీ వివిధ రకాల వ్యాధులకు టెలీ వైద్యసేవలు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌లో గోల్డెన్ అవర్ వైద్యసేవలకు ధర్మ ప్రాజెక్టును ఆరంభించటం అభినందనీయమన్నారు. కరోనా సమయంలో బాధితుల సేవలో డాక్టర్ శారద చూపిన తెగువ, మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కోసం చూపిన అంకితభావాన్ని సభాముఖంగా ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేసుకున్నారు. ఈసీజీ విభాగం ప్రారంభించిన ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజానికి డాక్టర్ శారద అందిస్తున్న సేవలు గొప్పవిగా చెప్పారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ ధర్మ ప్రాజెక్టు స్థాపనకు గల నేపథ్యాన్ని వివరించారు. పెదరావూరు గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, డాక్టర్ ధరణేంద్ర, గ్రామ కార్యదర్శి రామసుబ్బారావు, శ్రీశైల భక్త సేవాసమితి ఆళ్ల సుబ్బయ్య, కొడాలి భారతి, డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఆనంద్, కుదరవల్లి శంకరరావు, గోరికపూడి బాలరాజు, నన్నపనేని సుగుణ, పి.విజయలక్ష్మి, నళిని పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో పూరిలు దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని ఉడతా శివమ్మ, ఉడతా పాములమ్మ వీరి చిన్న కుమారుడు ఉడతా కరీముల్లా, కృష్ణవేణి, వీరంతా ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరింటికి నిప్పు అంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలానికి మేడికొండూరు తహసీల్దారు శ్రీనివాసశర్మ పరిశీలించారు. ప్రమాదంలో రూ. 2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడిన సీపీఐ

99వ ఆవిర్భావ సభలో రామకృష్ణ



సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

పాత గుంటూరు: కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాటాలు జరిపిన పార్టీగా ఘనకీర్తి, ఖ్యాతి సీపీఐకి దక్కుతుందని పార్టీ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. అధికారం ఉన్నా లేకున్నా శ్రమ ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని గుంటూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయం వద్ద పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఎగురవేయగా, లెనిన్ విగ్రహానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లయ్య లింగం భవన్‌లో సభకు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీకి ఘన చరిత్ర ఉందని తెలిపారు. ఒక రాజకీయ పార్టీగా 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సామాన్య విషయం కాదన్నారు. కష్టజీవుల కోసం జరిగే పోరాటాలలో సీపీఐ అగ్రభాగాన ఉంటుందని చెప్పారు. మతోన్మాద, అభివృద్ధి నిరోధక పార్టీ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉందని, దాన్ని గద్దె దింపేందుకు అంతా సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ రంగరాజ్, సీపీఐ నాయకులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ షెడ్యూల్ విడుదల

తాడికొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తాడికొండ మండల ఎంపీడీఓ అత్తోట దీప్తి అన్నారు. మండలంలో బుధవారం నుంచి సచివాలయాల వారీగా జరుగుతున్న ఆరోగ్య సురక్షా -2 షెడ్యూల్‌ను విడుదల చేశారు.

బీజేపీకి రామ్మోహనరావు రాజీనామా

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణానికి చెందిన జగ్గారపు రామ్మోహనరావు(రాము) బీజేపీ సభ్యత్వంతో పాటు రాష్ట్ర వీవర్స్ సెల్ కన్వీనర్ పదవికి రాజీనామా చేసినట్లు మంగళవారం తెలిపారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల కారణంగా పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరికి రాజీనామా లేఖను పంపినట్లు చెప్పారు.

1న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో నూతన సంవత్సర వేడుకల్ని పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు అలనాటి సినీ మధుర గీతాల్ని ఆలపిస్తారని ఆయన పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

లారీ, ట్రాలీ ఢీ.. డ్రైవర్ మృతి



ట్రాలీలో ఇరుక్కుపోయిన పవన్ మృతదేహం

తెనాలిరూరల్: ట్రాలీ ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తెనాలి-విజయవాడ రహదారిలో నంది వెలుగు, కంచర్లపాలెం అడ్డ రోడ్డు మధ్య మంగళవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న లారీ, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు నంది వెలుగుకు చెందిన తోట పవన్(28)గా గుర్తించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన సందర్భంగా ఆటో వెనుక ఉన్న మరో కారు ఆటోను ఢీకొట్టింది. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.